క్లుప్తంగా

యారాడ తీరంలో సినిమా సెట్



తీరంలో సినిమా షూటింగ్ కోసం వేసిన సెట్

పెదగంట్యాడ: విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రానికి సంబంధించి యారాడ తీరంలో షూటింగ్ జరగనుంది. ఈ నెలాఖరు నుంచి ఇక్కడ షూటింగ్ ప్రారంభం కానుండటంతో తీరంలో వేసిన సెట్ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో గాజువాకకు చెందిన బెస్ట్ విజన్ అడ్వాన్స్‌డ్ ఐ హాస్పిటల్ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించింది. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో 165మందికి కంటి పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, డాక్టర్ పావని వాడపల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

'అమర్ నామినేషన్‌కు తరలి రావాలి'



మాట్లాడుతున్న కనక మహాలక్ష్మినాయుడు

అగనంపూడి: గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గుడివాడ అమర్‌నాథ్ ఈ నెల 24న నామినేషన్ వేయనున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు కోరారు. వార్డులోని కాపు జగ్గరాజుపేటలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమర్‌కు భారీ స్థాయిలో సంఘీభావం తెలిపేలా ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి ప్రసాద్, వాడిశ అప్పలరాజు మాట్లాడారు.

చందనోత్సవంలో స్వచ్ఛంద సంస్థలే కీలకం



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఏటా వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిర్వహించే చందనోత్సవంలో భక్తులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు గొప్పవని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కొనియాడారు. వచ్చే నెల 10న చందనోత్సవం పురస్కరించుకుని ఆరోజు భక్తులకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఆదివారం ఈవో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్ వాటర్, సీతల పానియాలు,బిస్కట్లు, ఆహార పదార్థాలు అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏయే ప్రదేశాల్లో ఏ సంస్థలు సేవలందిస్తాయో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి,రాజేంద్ర, నరసింగరావు, డీఈ నాగేశ్వరరావు,ఏఈలు హరి,తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

జనమే జగనన్న బలం

- లబ్ధిదారులే వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లు
- రాష్ట్ర మంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 87వ వార్డులో విస్తృత ప్రచారం



ప్రభుత్వ సంక్షేమ పథకాలు తెలిపే కరపత్రాలు అందిస్తున్న అమర్‌నాథ్



ప్రచారంలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, ప్రజలు



87వ వార్డులో ప్రజలకు అభివాదం చేస్తున్న అమర్‌నాథ్



అగనంపూడి జంగాల కాలనీలో మహిళకు కరపత్రం అందిస్తున్న నక్కా రమణబాబు తదితరులు



79వ వార్డు షిర్డీ సాయినగర్‌లో ప్రచారం చేస్తున్న లక్ష్మీ ప్రసన్న తదితరులు



పెదకోరాడ పార్కులో వాకర్స్‌కు కరపత్రాలు అందజేస్తున్న గొందేశి వెంకటరమణారెడ్డి



64వ వార్డు కొంగపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న నక్క రమణ తదితరులు

కూర్మన్నపాలెం: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకుని అభిమానిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జనమే జగనన్న బలమన్నారు. సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన వారంతా స్టార్ క్యాంపెయినర్లేనని పేర్కొన్నారు. జీవీఎంసీ 87వ వార్డులో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుంచుమాంబ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కణితి నాయీబ్రహ్మణవీధి, ఏకలవ్యవీధి-1, 2, రజకులవీధి, ముస్లిం వీధి, ఈ-సేవా గ్రౌండ్స్, ఆర్యవైశ్య వీధి, కల్కిభగవాన్ ఏరియా, ఉడపలవీధి, విశ్వబ్రాహ్మణవీధి, తెలుకులవీధి, పద్మశాలి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావుతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ జన బలమే గీటురాయిగా, సామాజిక న్యాయమే పరమావధిగా, గెలుపే లక్ష్యంగా శాసనసభ, లోక్ సభ స్థానాలకు పోటీ పడుతున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలే అండగా ఉన్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత మన ముఖ్యమంత్రికే చెందుతుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొడ్డ గోవింద్, సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, కాండ్రేగుల అప్పలనాయుడు, బొడ్డేటి మోదీనాయుడు, వడ్లపూడి ఈశ్వరరావు, శీరం పాపారావు, మార్పు శేషు, ఆడారి శ్రీనివాస్, బొండా గోవిందరాజులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మంచి చేసిన నాయకుడిని మరోసారి గెలిపిద్దాం

అగనంపూడి: ప్రజలకు మంచి చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను మరోసారి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నక్కా రమణబాబు కోరారు. 85వ వార్డు అగనంపూడి జంగాల కాలనీలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. నిర్వాసిత కాలనీల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యాయంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయంటే ముఖ్యమంత్రి జగన్ కారణమన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న అలాంటి పార్టీని మరోసారి గెలిపించుకుంటే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహరాజు, హరీష్, బాబూరావు, శంకరరావు, రాము, రవి, గిరి తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

79వ వార్డు ప్రశాంతినగర్ వార్డు సచివాలయ పరిధిలోని షిర్డీ సాయి నగర్‌లో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్‌లలో ప్రచారం చేశారు. ఫ్లాట్లకు వెళ్లి కరపత్రాలు అందించి వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

75వ వార్డులో..

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు గొందేశి వెంకటరమణారెడ్డి కోరారు. 75వ వార్డు పెదకోరాడలో అమర్‌నాథ్‌కు మద్దతుగా ఆదివారం ఉదయం ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అమర్‌నాథ్‌ను, ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గొందేశి ప్రభాకర్‌రెడ్డి, గేదెల మధుసూదన్‌రెడ్డి, బసా గోపాల్‌రెడ్డి, కుప్పిలి వరప్రసాద్, కోరాడ కనకారావు, శీరపు శ్రీనివాస్, కోరాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 64వ వార్డు కొంగపాలెం, వెంకన్నపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క రమణ ఆధ్వర్యంలో ఆదివారం జోరుగా ప్రచారం చేశారు. గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పాలన కొనసాగింపునకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గవర సామాజికవర్గానికి రాజకీయ ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



గవర సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

గాజువాక : వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటే గవర సామాజికవర్గానికి రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తామని ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాక, పారిశ్రామిక ప్రాంత గౌరీ సంఘాల ఐక్య వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల్లో గవర సామాజిక వర్గానికి చెందిన వారంతా వైఎస్సార్‌సీపీకి ఏకపక్షంగా ఓటు వేశారని, అనకాపల్లిలోనూ తన గెలుపునకు సహకరించారని చెప్పారు. వారికి అక్కడ సముచిత ప్రాధాన్యం కల్పించామన్నారు. తనకోసం పని చేసిన ప్రతీ ఒక్కరిని గుర్తు పెట్టుకుని రుణం తీర్చుకుంటానన్నారు. ఈ ప్రాంతంలోని గవర సామాజికవర్గ సంఘాలు తనకు విజయాన్ని చేకూర్చితే ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తానని చెప్పారు.

గవర సంఘాలకు స్థలాలు

గవర సామాజికవర్గ సంఘాలకు స్థలాలు కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందని అమర్‌నాథ్ పేర్కొన్నారు. అవసరమైతే ఆయా స్థలాల్లో సామాజిక భవనాల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గవర సామాజికవర్గ బలం, సమస్యలు తనకు పూర్తిగా తెలుసని, వాటిని పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఏ సమస్య వచ్చినా తన వద్దకు రావచ్చని, వారి గౌరవం తగ్గకుండా చూసుకుంటానని అన్నారు.

గవర కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అమర్‌నాథ్‌ను గెలిపిస్తే గవర సామాజికవర్గ సమస్యలు పరిష్కారం కావడంతో పాటు సమాజంలో గౌరవం ఇచ్చేలా చూస్తామన్నారు. ఒక్కసారి అమర్‌నాథ్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. సభాధ్యక్షుడు ఆడారి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా గవర సామాజికవర్గానికి న్యాయం జరగడం లేదని, వైఎస్సార్‌సీపీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 76వ వార్డు ఇన్‌చార్జి దొడ్డి రమణ, గౌరీ సంఘాల నాయకులు మళ్ల అప్పలరాజు, బొడ్డేడ అచ్చెంనాయుడు, పెంటకోట నాగేశ్వరరావు, మద్దాల అప్పారావు, సూరిశెట్టి శివ, శరగడం సత్యనారాయణ, శరగడం కృష్ణ అప్పారావు, గంగాబాయి, కొణతాల వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం

- సీఎం జగన్ పాలనలో అన్ని రంగాల్లో సమున్నత గౌరవం
- మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్



ఎస్సీ సంఘాల ప్రతినిధులతో మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించింది అప్పట్లో డాక్టర్ వైఎస్సార్, ఇప్పుడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చట్టసభలు, కార్పొరేషన్లతో పాటు అన్ని రంగాల్లో వారికి సమున్నత గౌరవం కల్పించారన్నారు. చట్టివానిపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ప్రతినిధులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యం అన్నారు. గాజువాకలోని ఎస్సీల సమస్యల పరిష్కారానికి తాను ముందుంటానని తెలిపారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గాజువాకలో మే 2వ తేదీన ఎస్సీ సంఘాల ప్రత్యేక సమావేశానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి మాట్లాడుతూ ఎస్సీలంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక అదనపు ఎన్నికల పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, ఎస్సీ సంఘాల నాయకులు వై.మస్తానప్ప, కటికల కల్పన, మాటూరి శ్రీనివాసరావు, బలిరెడ్డి పెంటారావు, కాకినాడ పెంటారావు, గంట్యాడ గురుమూర్తి, కొల్లి దేముడు, గోవిందరాజు, గాలి ఆనంద్, పాము రామిశాస్త్రి, కంచర్ల శ్రీదేవి, ఇసుకపట్ల మీరాబాయి, కె.పుల్లారావు, అనపర్తి రమణ, వెంకటేష్, పేకేటి శ్రీను, డాక్టర్ రాజారావు, సాపే బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతోనే స్టీల్‌ప్లాంట్‌కు సమస్యలు

- రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరిని తెలియజేయాలి
- 'మహాగర్జన' లో పోరాట కమిటీ నాయకులు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే ఉక్కు పరిశ్రమ నేడు సమస్యలను ఎదుర్కొంటోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న ఉక్కు పోరాటానికి మద్దతు తెలిపిన ప్రతీ రాజకీయ పార్టీ తమ స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని కోరారు. పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉక్కు పరిశ్రమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1165వ రోజు ఆదివారం నిర్వహించిన మహాగర్జనలో పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇదే సరైన సమయం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ప్రతిఘటించడానికి ఇదే సరైన సమయం అని, తమ ఓటు హక్కు ద్వారానే నిరసనను తెలియజేస్తామని నాయకులు అన్నారు. సంస్థకు ముడి సరుకులు అందించకుండా నష్టాల బాట పట్టించి, తద్వారా సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలనే వ్యూహం రచించడం అన్యాయమన్నారు. దీనిని కార్మికులందరూ ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, జేఏసీ చైర్మన్ ఎం,జగ్గునాయుడు, యు.రామస్వామి, మస్తాన్‌రావు, కారు రమణ, డి.వి. రమణారెడ్డి, వరసాల శ్రీనివాస్, డి.సురేష్‌బాబు, పరంధామయ్య, కరణం సత్యారావు, శ్రీనివాసులు నాయుడు, నమ్మి సింహాద్రి, ఆడారి అప్పారావు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక ఉపనయనాలు



ఉపనయనాల్లో పాల్గొన్న కళింగ వైశ్యులు

సింహాచలం: విశాఖ జిల్లా యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో సింహాచలం కొండదిగువ ప్రైవేటు కల్యాణమండపంలో కళింగ వైశ్యులకు సామూహిక ఉపనయాలు ఆదివారం జరిగాయి. 150 మందికి ఉపనయనాలు చేశారు. తొలుత వీరంతా కొండదిగువన వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి అక్కడి నుంచి పాత గోశాల వద్ద ఉన్న కల్యాణ మండపానికి వెళ్లారు. అక్కడ శాస్త్రోక్తంగా వారికి యజ్ఞోపవీతధారణ చేశారు. విశాఖ జిల్లా యువజన చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు తలసు సాయిమోహన్, కార్యదర్శి భోగి ప్రవీణ్‌కుమార్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దైవచింతనతో దివ్యమైన జీవితం

దాబాగార్డెన్స్ : నగరంలోని చర్చి ఆఫ్ క్రైస్ట్ పాస్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో రెఫ్యూజ్ మినిస్ట్రీస్ ఫౌండర్ డైరెక్టర్ శ్యామ్ మింది పాల్గొని మాట్లాడారు. అనునిత్యం దైవ చింతనతో మెలగాలని సూచించారు. దేవుడు చేసిన ఉపకారాలు మరువరాదన్నారు. ఆరాధన అనంతరం నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేశారు.

అభాగ్యులకు భరోసా

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి వారికి కావల్సిన వైద్య సదుపాయాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మేమంతా సిద్ధం బస్ యాత్రలో భాగంగా సీఎం జగన్‌ను కలిసి తమ గోడు చెప్పుకొన్న బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

కొండంత అండ దొరికింది



నా పేరు కోరుబిల్లి కళావతి. నా భర్త శేఖర్ దినసరి కూలీ. మా పాప పరిమళకు 12 ఏళ్లు. వయసుకు తగ్గ మెదడు పెరగకపోవడంతోపాప ఎదుగుదల పూర్తిగా ఆగిపోయింది. చాలా ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేదు. దాంతోపాటు మా ఆయన శేఖర్‌కు ఫిట్స్ సమస్య వచ్చింది. ఇప్పుడు ఇద్దరి వైద్యానికి చాలా ఖర్చు అవుతుంది. ఈ రోజు మా ఊరు వచ్చిన జగనన్నకు మా పరిస్థితి చెప్పుకున్నాం. ఆయన వెంటనే స్పందించి వైద్యానికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రిపోర్ట్‌లు అన్నీ వారికి పెట్టాం. త్వరలోనే సాయం చేస్తామని వారు చెప్పారు. సీఎం గారిని కలవడంతో కొండంత అండ దొరికినట్లయింది.

మెరుగైన వైద్యం అందుతుంది



జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్ల నరవకు చెందిన సర్వసిద్ధి దుర్గా ప్రసాద్ ఏడాది కిందట కొబ్బరి చెట్టు మీద నుంచి పడిపోయాడు. దీంతో మెడ దగ్గర నరాల చిట్లడంతో శస్త్ర చికిత్సకు శరీరం సహకరించడంలేదు. ఏడాదిగా అతడు మంచం మీదే ఉన్నాడు. మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆదివారం పెందుర్తి మండలం రాంపురం వద్ద సీఎం వైఎస్ జగన్‌కు దుర్గాప్రసాద్‌ను చూపించిన కుటుంబ సభ్యులు పరిస్థితిని వివరించారు. దుర్గా ప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ హరికృష్ణకు సూచించారు.

సర్వజన మనోరంజని వాహనంపై సింహాచలేశుడు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామివారికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలను సర్వజన మనోరంజనిపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం సాయంత్రం సూర్యప్రభవాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జరిగిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగదాంబ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. హార్బర్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం 12.50 గంటల సమయంలో దాదాపు 50 సంవత్సరాలున్న వ్యక్తి కాన్వెంట్ జంక్షన్ నుండి షీలా నగర్ వెళ్తుండగా ఏపీ 31 టీటీ 6732 నంబర్ గల లారీ ఢీకొట్టి అతనిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి శరీరం నుజ్జునుజ్జు అయి అతను మృతి చెందాడని తెలిపారు. 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు, తెలుపు, నీలం చారల షర్టు, నల్ల ప్యాంట్ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

కదిలిన అభిమాన దండు

సీఎం జగన్ రోడ్ షోకు తరలి వెళ్లిన నాయకులు



88వ వార్డు వెదుళ్లనరవ నుంచి తరలిన కార్యకర్తలు, అభిమానులు

అగనంపూడి: విశాఖ నగరంలో వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' రోడ్ షోకు 88వ వార్డు వెదుళ్లనరవ నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. ముఖ్యమంత్రి జగన్ పెందుర్తి నియోజకవర్గంలోని గ్రామాల నుంచి విశాఖలో ప్రవేశించిన నేపథ్యంలో ఇక్కడి నాయకులు భారీ స్థాయి ర్యాలీగా వెళ్లారు. నాయకులు సర్వసిద్ధి బొరయ్యనాయుడు, చట్టి తాతారావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.